క్లుప్తంగా

అక్రమంగా చెట్ల నరికివేత



అక్రమంగా నరికి వేసిన చెట్లు

కొయ్యలగూడెం: ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ (శిథిలావస్థ భవనం)లో అక్రమంగా చెట్లను నరికి వేస్తున్నారని స్థానికులు శుక్రవారం ఆరోపించారు. కొయ్యలగూడెం నడి బొడ్డున జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న పాత ఆర్‌అండ్‌బీ భవనంలో ఇటీవల సుమారు వంద సంవత్సరాల నాటి వేప వృక్షం కూలిపోయింది. దీనిని అధికారులు ఆక్షన్ నిర్వహించగా, మరికొన్ని చెట్లను అక్రమార్కులు కొట్టి వేసి తరలించుకుపోతున్నారని ఆరోపించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితంగా లేకుండా పోయిందన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

జంగారెడ్డిగూడెం: నేటి నుంచి జరగబోయే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌ఐఓ కె.యోహాను తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యావికాస్, వెంకటేశ్వర, పద్మావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, త్రివేణి, సూర్య, గురుకుల సంక్షేమ బాలికల, రామచంద్ర కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 3548 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన తెలిపారు.

ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: మండలంలోని కేతవరం గ్రామ పంచాయతీ కొత్తగూడెంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మహా అన్న సమారాధన నిర్వహించారు. ఆరేటి ఏసుబాబు, బాలం నరేష్, పెదమళ్ల బాలు, టైలర్ సుబ్బారావు, ఎర్రవలు బాబురావు, కలవకండి శ్రీను, నామాల శ్రీను, మధు వంశీ, మాము తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

జంగారెడ్డిగూడెం: కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. ప్రజా సంఘాల కార్యాలయంలో కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 3న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎ.ప్రభాకర్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

భారత వైజ్ఞానిక కాంతి పుంజం సీవీ రామన్

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జంగారెడ్డిగూడెంలో సైన్స్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీవైఈవో రామన్నదొర



చింతలపూడిలో విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేషనల్ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు లోవకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను, ఉప విద్యాధికారి మడకం రామన్న దొర ప్రారంభించారు. ఈ సందర్భంగా రామన్న దొర మాట్లాడుతూ సైన్స్‌ను ప్రజోపకరమైన కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. అలాగే ప్రతిభ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహిచారు. ప్రధానోపాధ్యాయులు లోవకుమారి, ఉపాధ్యాయులు జగదీష్, చిలుకూరి సుధాకర్‌రెడ్డి, టీవీ రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం.

కొయ్యలగూడెం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం మండల వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ప్రజ్ఞావంతమైన పరికరాలను తయారు చేసి వాటిని డెమో నిర్వహించి విద్యాశాఖ అధికారుల మన్ననలను పొందారు. కార్యక్రమాలను ఎంఈఓ జె.సురేష్ బాబు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకుడు ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయ కృష్ణ, ఉమ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

చింతలపూడి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌పై క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మాటూరి చక్రధర రావు, తెరేసమ్మ, ఒ.సుజాత, రవి కుమార్, సత్య కుమారి, షర్మిల, సుధా, ఎస్‌జేకే నరేంద్రకుమార్, ఎ.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను మళ్లీ దళారీ, ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం దురదృష్టకరమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ అన్నారు. శుక్రవారం స్థానిక గౌడ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో విఘ్నేష్ మాట్లడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్ వ్యవస్థ నుంచి కార్మికులకు విముక్తి కలిగిందని, అలాగే జీతాలు సుమారు రూ.21 వేల వరకు పెరిగాయన్నారు. ఒకటో తేదీనే జీతాలు అందేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పి.కాశి, మద్దాల ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల విధులు చాలా విలువైనవని, వారి న్యాయమైన కోర్కెలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీ రమణ, కుంచె వసంతరావు, పి.సూర్యారావు, కంతేటి వెంకటరావు, నిమ్మల సుబ్బారావు, అయినాల ముత్యారావు, దోసూరి నాగరాజు, బొక్కా శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరావు, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత



నాగేశ్వరరావుకు కృతిమ కాలు అందజేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగునికి శుక్రవారం కృత్రిమ కాలు అందజేశారు. టి.నరసాపురం మండలం ముత్యాలమ్మపేటకు చెందిన తాత నాగేశ్వరరావు విద్యుత్ షాక్ గాయం వలన కుడి కాలు తొలగించారు. అంగ వైకల్యంతో నాగేశ్వరరావు నడవలేక ఇబ్బంది పడుతుండేవాడు. విషయం డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం దృష్టికి రాగా, దాతల సహకారంతో కృత్రిమ కాలు అందజేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన అగాపే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బిరుదుగడ్డ ఆసిబాబు సహకారంతో ఏర్పాటు చేసిన కృత్రిమ కాలుని నాగేశ్వరరావు నివాసం వద్దకు తీసుకెళ్లి అందజేశామని అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా తెలిపారు. కార్యక్రమంలో డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు నేలప్రోలు ప్రభాకర్‌రావు, లబ్ధిదారులు తాతా నాగేశ్వరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సినీ నటుడు షఫీ సందడి



నిమ్మకాయల వ్యాపారులతో సినీ నటుడు షఫీ

ద్వారకాతిరుమల: నిమ్మకాయలు బాబు.. నిమ్మకాయలు, కవరు పది రూపాయలు మాత్రమే రండి, రండి అంటూ ప్రముఖ సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ షఫీ ద్వారకాతిరుమలలో గురువారం సందడి చేశారు. సినీ నటుడు మాణిక్‌రెడ్డితో కలిసి ఆలయానికి విచ్చేసిన షఫీ స్వామి వారి దర్శనానంతరం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే స్థానిక లింగయ్య చెరువు వద్దకు వచ్చే సరికి నిమ్మకాయలు అమ్మే మహిళలు షఫీ కారుకు అడ్డు పడి, నిమ్మకాయలు కొనాలని కోరారు. వెంటనే కారు దిగిన షఫీ నేను కూడా నిమ్మకాయలు అమ్ముతానంటూ కింద కూర్చున్నారు. దీంతో చుట్టూ ఉన్న వ్యాపారులు నవ్వులు చిందించారు. అనంతరం షఫీ ఆ వ్యాపారులతో ఫొటోలు దిగారు. ఛత్రపతి, ఖడ్గం వంటి హిట్ చిత్రాల్లో నటించిన షఫీ తమతో సరదాగా గడపడం ఆనందాన్ని ఇచ్చిందని వ్యాపారులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే షఫీ వ్యాపారులతో దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం వైరల్ అయ్యాయి.

వైభవంగా వీరేశ్వరస్వామి కల్యాణం



తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి శివరాత్రి మహోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. వీరేశ్వర స్వామి, భద్రకాళీ అమ్మవార్లకు ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజలు, నిత్యహోమాలు, దేవాలయ బలిహరణ, ధూపదీప సేవలు నిర్వహించారు. ఉదయం 10.15 గంటలకు భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శాశ్వత ధర్మకర్త కల్లూరి సత్యనారాయణ, రత్నకుమారి దంపతులు, కల్లూరి శ్రీనివాసరావు, నిర్మల దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా, అర్చకులు కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. పామర్తి వెంకటేశ్వర రావు, వాసవీ సాయినగేష్, శ్రీసాయి విజిటీ బుల్స్, రైతు డైరీ వారి ద్రవ్య సాయంతో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు, కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత కొండలరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఓ భక్తుడు శుక్రవారం రూ.2,02,232 విరాళంగా అందజేశారు. విశాఖపట్నం జిల్లా మల్కాపురానికి చెందిన కుర్రెళ్ల కొండలరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రేపు ప్రజ్ఞా వేదంపై శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక శేషాద్రి నగర్‌లోని గౌరీ సుభద్ర పిరమిడ్ అనుబంధ మైత్రేయ మందిరంలో ఈ నెల 2న ప్రజ్ఞా వేదంపై ఒక రోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. మార్చి రెండో తేదీ ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విశాఖపట్నానికి చెందిన సద్గురు స్పిరిచ్యువల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భీమనేని వంశీ కిరణ్ ప్రధాన వక్తగా, శిక్షకులుగా ప్రజ్ఞావేదం అనే అంశంపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ధ్యానులు, సాధకులు, ఆరోగ్యాభిలాషులు పాల్గొనాలన్నారు.

వేద పండితుడికి ఘన సత్కారం



లక్ష్మీనారాయణ అవధానికి స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ సత్యనారాయణమూర్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో శుక్రవారం పదవీ విరమణ చేసిన వేద పండితుడు తూట్లగుంట లక్ష్మీనారాయణ అవధానులను ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి ఘనంగా సత్కరించారు. ముందుగా అవధాని కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవధాని సేవలను ఈఓ కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ డీఈఓ బాబురావు, సూపరింటెండెంట్లు రమణరాజు, దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో రాజవరం విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాజవరం హైస్కూల్ విద్యార్థులు

కొయ్యలగూడెం: ఖోఖో, త్రోబాల్ పోటీల్లో రాజవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచారని పీఈటీ జె.శ్రీనివాస్ శుక్రవారం పేర్కొన్నారు. గ్రిక్స్ జోన్స్ మీట్ పోటీలు ఫిబ్రవరి 21, 22 తేదీల్లో జంగారెడ్డిగూడెం జెడ్పీ హెచ్‌ఎస్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహించారన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు బాలుర విభాగం ఖోఖో, త్రోబాల్ పోటీలలో జోన్ లెవెల్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 25వ తేది ఏలూరులో నిర్వహించిన సెంట్రల్ జోన్ ఇంటర్ స్కూల్ చాంపియన్ షిప్ పోటీల్లో వారు పాల్గొన్నారు. దీనిలో రాజవరం హైస్కూల్ బాలురు విభాగం ఖోఖో ప్రథమ స్థానం సాధించారన్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ



నూకాలమ్మ రజత వస్త్రానికి వెండిని అందిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. నిత్య కైంకర్యాలు అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ మాడ రామకృష్ణ, లక్ష్మీ సావిత్రి దంపతులు 10 తులాల వెండిని అమ్మవారి వెండి చీర నిమిత్తం సమర్పించారు. నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం సభ్యులు పులిహోర ప్రసాదాన్ని వితరణ చేశారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

కొయ్యలగూడెం: పశువులకు టీకా కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కొయ్యలగూడెం మండల పశు వైద్యశాఖ అధికారి బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమం 31వ తేదీ వరకు నిర్వహిస్తామని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. గాలికుంటు వ్యాధి, కాలిగిట్టలు, నోటి వ్యాధులకు టీకాలు వేస్తామన్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా టీకా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

టి.నరసాపురం: కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఐదు రోజులు నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సామంపూడి బాల సూర్యనారాయణరాజు ప్రారంభించారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కషాయం తయారీలో శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: రైతులకు వర్మీ కంపోస్ట్ కషాయం తయారీపై శిక్షణ కార్యక్రమం బయ్యనగూడెంలో శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ వారి ఆధ్వర్యంలో డీపీఎం తాతారావు ఆదేశాల మేరకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కషాయం, ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

సుబ్రమణ్యం మాస్టారుకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం: లక్కవరం రెడ్డిపేట ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మం మాస్టారుకు న్యాయం చేయాలని దళిత సంఘం, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. లక్కవరం రెడ్డిపేట పాఠశాలలో అన్యమత ప్రచారం చేస్తున్నారంటూ సుబ్రహ్మణ్యం మాస్టారుపై అసత్య ప్రచారాలు చేసి, ఆయనను సస్పెండ్ చేయించారన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, డీఎస్పీకి, ఎంఈవోకు వినతి పత్రాలు అందజేశారు.

దర్జీ వృత్తిని పరిశ్రమగా గుర్తించాలి



చింతలపూడిలో విలియమ్స్ హో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టైలర్లు

చింతలపూడి: దర్జీ వృత్తిని ప్రభుత్వం పరిశ్రమగా గుర్తించి రాయితీలు ప్రకటించాలని చింతలపూడి ఆదర్శ టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసిరెడ్డి సురేష్ డిమాండ్ చేశారు. టైలర్స్ డే సందర్భంగా కుట్టు మిషన్ సష్టికర్త విలియమ్స్ హో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎండి జిలాని, ఉపాధ్యక్షులు రెబ్బా ప్రసాద్, బి సురేష్, ట్రెజరర్ వాడపల్లి చెన్నారావు, కలిదిండి రామరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలి

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టైలర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనాల సర్వేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం టైలర్స్‌ను ఆదుకోవాలన్నారు. స్కూల్ యూనిఫాంలను టైలర్లకే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు ఎస్‌కే సిరాజ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో టైలర్స్ పాల్గొన్నారు.

పది వేల భృతి పునరుద్ధరించాలి

కొయ్యలగూడెం: టైలర్లకు రూ.పది వేల భృతి పునరుద్ధరించాలని టైలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి టైలర్‌కి పదివేల రూపాయల భృతి సంవత్సరానికి అందించడం వలన గ్రామీణ ప్రాంతాల దర్జీల జీవనోపాధికి దోహదపడిందన్నారు. అనంతరం మహిళా దర్జీలు కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

కామవరపుకోట: మండలంలోని శ్రీవీరభద్ర టైలర్ల యూనియన్ తరపున టైలర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ కనిపెట్టిన ఎలియాస్ హోవే చిత్రంతో కూడిన బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. మిడతా రమేష్‌బాబు, సాయిన కనకరాజు, షేక్ ఇబ్రహీం, వేముల సాయి పన్నుబోయిన సురేష్, దావులూరు చిన్న బాబు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి

కుక్కునూరు: రెడిమెడ్ రంగం బాగా అభివృద్ధి చెందడంతో టైలర్లు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారని టైలర్ల సంఘం మండల అధ్యక్షుడు మాదాబత్తుల ఆనంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ రెడీమేడ్ రంగంతో టైలర్ల ఆర్థిక పరిస్థితి కుంటుపడిందన్నారు. దయనీయ స్థితిలో ఉన్న దర్జీలకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పాదం రాము, రమణయ్య, ఖాదర్, సుకూర్, లంకల రమణ, గాడిద రాఘవులు పాల్గొన్నారు.